ఇసుక కోసం వెళ్లి.. మానేరులో చిక్కుకొని...

● కాపాడిన స్థానికులు, పోలీసులు

6



ఇసుక ట్రాక్టర్ల యజమానులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐలు

- నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం
- నిజాం నవాబును గడగడలాడించిన గట్టేపల్లి మురళి
- తెలంగాణ విముక్తి పోరులో మంథని యోధులు
- నిజాం సర్కార్ పై సాయుధ, సత్యాగ్రహ తిరుగుబాటు
- ఠాణాలపై దాడులు-అధికారుల హత్యలు
- చాందా క్యాంపులో మిలటరీచే సాయుధ శిక్షణ



చాందా క్యాంపులో శిక్షణ పొందిన మంథని వీరులు (ఫైల్)

సాయుధ పోరాటంలో అలుపెరుగని యోధులు

నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు ఎందరో పోరుబాటను ఎంచుకున్నారు. నిజాం నవాబు పాలనను అంతం చేసేందుకు మంథని, మహదేవపూర్, గట్టెపల్లి ప్రాంతానికి చెందిన ఎందరో పోరాటయోధులు అజ్ఞాతం బాట పట్టి నిజాం పాలనపై తిరుగుబాటు జెండా ఎగుర వేశారు. ఒక వైపు సాయుధంగా, మరో వైపు సత్యగ్రహ ఉద్యమాల్లో ప్రజలను చైతన్యవంతులను చేసి నిజాం మెడలు వంచడానికి అలుపెరుగని పోరాటం చేశారు. ఎందరో పోరాటాల ఫలితంగా సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైన వేళ ఒక్కసారి నాటి పోరాటయోధులను స్మరించుకుందాం..

మంథని/సుల్తానాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనలో ఉన్న తెలంగాణ పల్లెల్లో స్వాతంత్ర్యాన్ని తేవడానికి మంథని ప్రాంత పోరాట వీరులు సాయుధ, సత్యాగ్రహ సంగ్రామాలకు శ్రీకారం చుటారు. మంథనికి చెందిన గులుకోట శ్రీరాములు సాయుధ పోరా టానికి నాయకత్వం వహించగా, రఘునాథ్ కాచే నిజాంకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులు చేస్తూ కార్యకలాపా లను విస్తరించడంలో కీలక భూమిక పోషించారు. వీరిద్దరి నాయకత్వంలో ఎందరో యోధులు సాయుధ, సత్యాగ్రహ పోరాటం చేశారు.

● సత్యాగ్రహవాదులు వీరే..

స్వామి రామనందతీర్థ సరస్వతీ పిలుపు మేరకు సత్యా గ్రహ ఉద్యమంలో మంథనికి చెందిన రఘునాథ్‌కాచే ఆధ్వ ర్యంలో పీ.గణపతిరావు, అవధానుల కిష్టయ్య, ఎం.గణపతి, మురళీధర్ కాచే, దేవళ్ల రాజేశ్వర్‌రావు, గట్టు రామన్న, వెంకటరాజన్న, ఎస్.నర్సింహులు నిజాం సర్కార్‌కు వ్యతిరే కంగా పనిచేశారు. నిజాంను వ్యతిరేకించినందుకు వీరంతా జైలుశిక్షను అనుభవించారు.

● చాందాలో సాయుధ శిక్షణ..

శ్రీరాములు బృందం మహారాష్ట్రలోని చంద్రాపూర్ (చాందా)లో భారత సైన్యం ఆధ్వర్యంలో సాయుధ శిక్షణ

● సాయుధ పోరాట వీరులు వీరే..

రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో మంథనికి చెందిన స్వర్గీయ గులుకోట శ్రీరాములు నేతృత్వంలో పనకంటి కిషన్ రావు, సువర్ణ ప్రభాకర్, చొప్పకట్ల చంటయ్య, డీ.రాజన్న, రాంపెల్లి కిష్టయ్య, దామోదర్‌ధామస్, శివనాద్రి శంకరయ్య గుప్తా, నరహరి, ఎలిశెట్టి సీతారాంలు సాయుధ పోరాటంలో పాల్గొన్నారు.



రఘునాథ్‌కాచే (ఫైల్)



గులుకోట శ్రీరాములు(ఫైల్)

పొందారు. గడ్చిరోలి జిల్లా సిరివంచ లో క్యాంపును ఏర్పాటు చేసుకొని అజ్ఞాతంలో ఉంటూ నిజాం పోలీస్, అధికారుల పై గెరిల్లా దాడులు చేసి సంచలనం సృష్టించారు.

● పోలీస్‌స్టేషన్లపై దాడులు, అధికారుల హత్యలు..

మహారాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆయుధ సంపత్తిని సమకూర్చుకున్న శ్రీరాములు బృందం 1948లో గోదావరి నది దాటి నిజాం సంస్థాన గ్రామాలైన కాళేశ్వరం, మహదేవపూర్, దామెరకుంట పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి నిజాం ప్రభుత్వానికి సవాల్ విసిరారు. దామెర కుంటలో కలెక్టర్ పర్యటనకు వెళ్లిన అధికారులపై దాడి చేసి హతమార్చారు. కాళేశ్వరంలో నిజాం ఠాణా పై జరి పిన దాడిలో శ్రీరాములు కాలుకు తుపాకి తూటాలు తగి లినా మొక్కవోని ధైర్యంతో దాడిని విజయవంతం చేశారు. మంథని, మహదేవపూర్ తాలూకాల్లో నిజాంపాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఉవ్వెత్తున ఉద్యమించారు. 1948 సెప్టెంబర్ 17న భారత సైనిక చర్యతో దిగి వచ్చి భారత సర్కార్ ముందు నిజాం నవాబ్ తలవం చడంతో హైదరాబాద్ సంస్థానం భారత ప్రభుత్వంలో విలీనమైంది.

● మంథని తొలి ఎమ్మెల్యే గెలిచిన శ్రీరాములు..

అజ్ఞాతంలో ఉన్న శ్రీరాములు బృందం బయటకు రాగా కాళేశ్వరం నుంచి మంథని వరకు ప్రజలు బ్రహ్మారథం పట్టారు. రఘునాథ్ కాచే ఆధ్వర్యంలో మంథనిలో జరిగిన బహిరంగ సభలో తొలిసారిగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. 1952లో జరిగిన తొలి శాసన సభ ఎన్నికల్లో శ్రీరాము లు సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి మంథని మొట్టమొదటి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. శ్రీరాములు బృందంలో సాయుధ పోరాటం చేసిన వారిలో సువర్ణ ప్రభాకర్

(మిగతా 8వ పేజీలో)

నిజాం నవాబును గడగడలాడించిన మురళి

తెలంగాణ విముక్తి పోరులో సుల్తానాబాద్ మండలం గట్టేపల్లి గ్రామానికి చెందిన మురళీధర్ రావు కీలకపాత్ర పోషించారు. సాయుధ పోరులో అలుపెరగని ధీరుడిగా నిజాం పాలకులకు సింహ స్వప్నంగా మారాడు. రజాకార్ల చీఫ్ ఖాసీం రజ్వీ అరాచకాల నుంచి ప్రజల మాన ప్రాణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషించారు. పలుమార్లు నిజాం సైన్యానికి పట్టుబడగా చిత్రహింసలకు గురి చేశారు.



మాజీ ప్రధాని పీవీ నర్సింహరావుతో మురళి(ఫైల్)

● ఉన్నత కుటుంబంలో జన్మించినా..

గట్టేపల్లి మురళి ఉన్నత కుటుంబంలో జన్మించినా దేశ సేవే లక్ష్యంగా సాయుధ పోరులో నిలిచారు. అనభేరి ప్రభాకర్ రావు సహాయంతో మురళి పోరాడుతూ నిజాం సైన్యం, రజాకార్ల పై దాడులు చేసే వారు. 1943 లో మురళి కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. దళాలతో కలసి గౌరెల్లి జమీందారిని నర్సుబాయమ్మ దౌర్జన్యాలను ఎదుర్కొ న్నాడు. హుస్నాబాద్ గుట్టల్లో అనభేరి నాయకత్వంలో మురళి దళసభ్యులతో కలసి రజాకార్ల సైన్యాన్ని ఎదిరిం చాడు. అయితే ఆ రోజు జరిగిన కాల్పుల్లో పలువురు మృతి చెందగా మురళి బయటపడ్డాడు.

● ధైర్యసాహసాలే ఆయన ఊపిరి

ఎలాంటి సాహసానికైనా మురళి తెగించేవాడు. విద్యార్థి దశలో మురళి గట్టేపల్లి నుంచి సైకిల్ పై జమ్మికుంట, వరంగల్‌కు వెళ్లేవారు. మార్గమధ్యలో పులి ఎదురుపడితే గొడ్డలితో పులిని హతమార్చాడు. ఇంటి పేరు సాయపు రాజు అయినా ఆయనను అందరూ గట్టేపల్లి మురళి అనే పిలిచేవారు. హెచ్ఎస్‌సీ విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. మంథనిలో పీవీ నర్సింహరావు కాంగ్రెస్ తరఫున, మురళి కమ్యూనిస్టు అభ్యర్థిగా అసెంబ్లీ పోటీ చేయగా పీవీ గెలిచారు. అనేక భాషల పై మురళి పట్టు సాధించారు. మురళి వాయు, జల స్తంభన విద్యలతో పలుమార్లు తప్పిం చుకున్నాడు. నిజాం సైన్యం మురళిని వెంటపడగా ఓ చెరువులో దూకాడు. సైన్యం ఎంత సేపు ఎదురుచూసిన మురళి బయటకు రాలేదు. వాయు, జల స్తంభన విద్యలతో నీటిలో గంటల తరబడి ఉన్నాడు. మురళి చనిపోయాడని సైన్యం వెళ్లిపోయిన తర్వాత బయటకు వచ్చి ఆరేళ్ల అజ్ఞాత వాసం గడిపారు.

మురళి పట్టుబడిన సందర్భంలో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సీతాపతి మురళిని కాలితో తన్నాడు. వీరి మధ్య వాగ్వాదం తో నెల రోజుల్లో సీఐని చంపుతానని మురళి శపథం చేశాడు. జైలు నుంచి తప్పించుకున్న మురళి తన ఉనికిని సీఐ సీతాపతికి పంపించడం, పోలీసులతో కలిసి సీతాపతి కాల్పులు జరపగా మురళి గాయపడ్డాడు. మురళి జరిపిన కాల్పుల్లో సీఐ సీతాపతి చనిపోయాడు. మురళి 1988 జూన్ 2న మృతి చెందాడు. 2023 మే 7న మురళి కాంస్య విగ్రహాన్ని వారి అభిమానులు గట్టేపల్లిలో ఏర్పాటు చేయగా ఆనాటి మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించారు.

ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించాలి

పెద్దపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించి గుర్తింపు తెచ్చుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక రేట్‌లో నియమించిన గ్రామ పరిపాలన అధికారులకు మంగళవారం నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ వ్యవస్థను గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రభుత్వం గ్రామాల్లో గ్రామ పరిపాలనా అధికారులను నియమించిందని తెలిపారు. గ్రామాలలో చేసే ప్రతి పని ప్రజలు గమనిస్తారని, ప్రతిపని ఆన్‌లైన్‌లో నమోదవుతున్నందున ఎటు వంటి అవకతవకలకు, నిర్లక్ష్యానికి పాల్ప డేందుకు ఆస్కారం లేదన్నారు. గ్రామపాలన అధికారులు కంప్యూటర్ పరిజ్ఞానం పెంచు కోవాలని, ప్రతి రిపోర్టును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామ పాలన అధికారులు భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన నూతన రెవెన్యూ చట్టం భూ భారతిని పటిష్టంగా అమలు చేసేందుకు బాధ్యతతో పని చేయా లని, ఉత్తమ సేవలతో రెవెన్యూ శాఖకు, జిల్లాకు మంచి పేరు తేవాలని కలెక్టర్ తెలిపారు. ఆర్డీవోలు గంగయ్య, సురేష్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, నూతన గ్రామ పరిపాలన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం



ప్రసంగిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

జ్యోతినగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : దేశాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమైనదని రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్‌కిశోర్ ఝా అన్నారు. ఇంజనీర్స్‌డే సందర్భంగా సోమవారం రాత్రి ఎన్టీపీసీ అధికారుల సంఘం ఆధ్వర్యంలో కాకతీయ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీపీ మాట్లాడుతూ దేశ దశ, దిశను నిర్దేశిస్తున్నది ఇంజనీర్లేనన్నారు. దేశానికి వెలుగులను అందిస్తున్న ఎన్టీపీసీని ప్రపంచ స్థాయి సంస్థగా తీర్చిదిద్దిన ఘనత ఆ కంపెనీ ఇంజనీర్లకే దక్కుతుందని తెలిపారు. ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత ప్రసంగిస్తూ సంస్థ ఇంజనీర్లు అంకితభావంతో పని చేస్తున్నారని, వారి కృషి వల్లే ఎన్టీపీసీ అభివృద్ధి సాధించిందన్నారు. అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మహేంద్రకుమార్, నితీష్ కుమార్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. తొలుత సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి సీపీ, ఈడీ, అధికారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

యువత మత్తుకు బానిసకావద్దు

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) మత్తు పదార్థాలకు యువత బానిస కావద్దని ఎమ్మెల్యే చింత కుంట విజయరమణారావు సూచించారు. మాదకద్రవ్యాల నివారణపై అవగాహనను కల్పిస్తూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి మసీదు చౌరస్తా, జెండా చౌరస్తా మీదుగా ఎం.బి గార్డెన్స్ వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెద్దపల్లి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహనను కల్పిస్తూ పెద్దసంఖ్యలో యువతను భాగస్వామ్యం చేస్తూ అవగాహనసదస్సు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మత్తుకు ఎవరూ బానిస కావద్దని యువత దేశానికి మార్గదర్శకంగా నిలువాలన్నారు.



అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే విజయరమణారావు

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈగల్ అనే నినాదంతో మత్తును పారదోలడానికి పని చేస్తున్నారన్నారు. యువత ముఖ్యంగా తల్లిదండ్రుల గౌరవం కాపాడుతూ సమాజంలో మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే నష్టాలపై మీ చుట్టు పక్కల ప్రాంతాల్లో వివరించాలన్నారు. మత్తు పదార్థాల రవాణ విక్రయాలపై పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, దీనికోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. కరీంనగర్‌కు చెందిన సైకియాట్రిస్ట్ వరేష్, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు, వాటికి అలవాటైన వారిని మాన్పించాలనే అంశాలపై వివరించారు. జిల్లాయూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొంకూరి అవినాష్, డీసీపీ కరుణాకర్, ఏసిపి గజ్జి కృష్ణ, సిఐలు ప్రవీణ్, అనిల్, ఎస్సైలు, వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, టీఎన్‌జీవో అధ్యక్షుడు బొంకూరి శంకర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్, మాజీ కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

కుట్ర పూరితంగానే యాజమాన్యం లాభాలు ప్రకటించడం లేదు

గోదావరిఖని, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కుట్ర పూరితంగానే 2024-25 ఆర్థిక సంవత్సరం లాభాలను యాజమాన్యం ప్రకటించడం లేదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. మంగళవారం సింగరేణి ఆర్జీ-1 ఏరియా లోని జీడీకే11 ఇంక్లైన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం ఆగస్టు 24న బోర్డు సమావేశంలో జరిగిన విషయాన్ని ఈనెల 12న హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో కంపెనీకి వచ్చిన లాభాలను ప్రకటించాలని, 35శాతం వాటా త్వరగా చెల్లించాలని, అదేవిధంగా గత సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్ల అమలుకు సర్క్యులర్‌లు జారీ చేయాలని అడిగితే యాజమాన్యం సమాధానం చెప్పకుండా దాటవేసిందన్నారు. అందుకే స్ట్రక్చర్ సమావేశాన్ని బహిష్కరించామని ఆయన పేర్కొన్నారు. టీబీజీకేఎస్ హయాంలో ఆరేడు సంవత్సరాలుగా కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని, ఏఐటీయూసీ సింగరేణిలో కోర్టుకు వెళ్లి ఎన్నికలు పెట్టించి, గెలిచిన తరువాత కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని స్ట్రక్చర్ సమావేశాల్లో, ఒక సారి సీఎండీ స్థాయి జరిగిన సమావేశాల్లో చర్చ జరిగి కొన్ని డిమాండ్‌లను అంగీకరించిన యాజమాన్యం ఆరు నెలలు గడిచినా వాటి అమలు కోసం సర్క్యులర్‌లు జారీ లేదని ఆయన ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19న సింగరేణి వ్యాప్తంగా అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చామని పేర్కొన్నారు. ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, నాయకులు రంగు శ్రీను, ఎస్ వెంకట్‌రెడ్డి, సిద్దమల్ల రాజు, సయ్యద్ సోహేల్, గండి ప్రసాద్, ఎం చక్రపాణి, చెప్యాల భాస్కర్, గోసిక మోహన్, కే కనకరాజ్, ఎంఎ గౌస్, నాయిని శంకర్, గొడిశెల నరేశ్, జాన్ కెనడి, రియాజొద్దీన్, మానాల శ్రీనివాస్, బలుసు రవి, బండి మల్లేష్, దాసరి శ్రీనివాస్, బీ సమ్మయ్య, పొన్నం రంజిత్, ఉప్పులేటి తిరుపతి, దొడ్డిపల్లి రవి, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీతారామయ్య

పుట్ట మధు ఇంటి ఎదుట కాంగ్రెస్ శ్రేణుల ధర్నా

- పెంచికల్‌పేటలో దుద్దిళ్ల కుటుంబ సభ్యులపై పుట్ట మధు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపణ
- కాంగ్రెస్ నేతలతో ప్రాణ హాని ఉందంటూ శైలజ ఫిర్యాదు

మంథని, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు నివాసం ఎదుట కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగిన సంఘటన మంగళవారం ఉద్రికత్తకు దారితీసింది. కమాన్‌పూర్ మండలంలోని పెంచికల్ పేటలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు తన ప్రసంగంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, అతని తండ్రి మాజీ శాసనసభా స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావుల పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో హనుమాన్ నగర్‌లోని పుట్ట మధు నివాసం ఎదుట ఆందోళనకు దిగారు. పుట్ట మధు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. శ్రీపాదరావు, శ్రీధర్‌బాబులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పుట్ట మధు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. పుట్టమధు కుటుంబసభ్యులు, బీఆర్ఎస్ శ్రేణులు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పుట్ట శైలజలు వారి వద్దకు వచ్చి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎంతసేపు ఇలాంటి ధర్నాతో ఇంట్లో వాళ్ళను భయభ్రాంతులకు గురి చేస్తారని, పోలీసులు దగ్గర ఉండి మరి తమ ఇంటి ఎదుట ఆందోళన చేయిస్తున్నారని వారితో వారించారు. ఈక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మంథని సీఐ రాజు, ఎస్ఐ రమేష్‌లు ఇరువర్గాలను సముదాయించారు. దీంతో కాంగ్రెస్ వారు అక్కడి నుంచి వెళ్ళిపోయారు. పుట్ట శైలజ సీఐ, ఎస్ఐలతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. కావాలనే ఇదంతా చేయించాలని ఆరోపించారు. పుట్ట మధు, తనకు కాంగ్రెస్ నేతల నుంచి ప్రాణహాని ఉందంటూ శైలజ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నేతలు శశిభూషన్ కాచే, కొత్త శ్రీనివాస్, అయిలి ప్రసాద్, కొండ శంకర్, వొడ్నాల శ్రీనివాస్, మంథని సత్యం, ఆకులకిరణ్, ముస్కుల సురేందర్‌రెడ్డి, కుడుదుల వెంకన్న, ఎరుకల ప్రవీణ్, ఆరెల్లి కిరణ్, గంగాధర సమ్మయ్య, పోలు శివ, రావికంటి సతీష్‌లో పాటు దాదాపు వందమంది వరకు తమ ఇంటి పై దాడికి వచ్చి తన భర్త పుట్ట మధును చంపడానికి ప్రయత్నించారని, అతను ఇంట్లో లేదని తెలుసుకొని ఆందోళనతో తనను భయభ్రాంతులకు గురి చేశారన్నారని, ఇలాంటి సంఘటనలు మళ్ళీ జరగకుండా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈఘటనల నేపథ్యంలో స్థానిక అంబేద్కర్ చౌక్‌లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు ఏర్పాటు చేశారు.



పుట్ట మధు ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



పోలీసులతో వాగ్వాదానికి దిగిన పుట్ట శైలజ

పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం 18మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే పూలమాలలతో సన్మానించి, వారికి సన్మాన పత్రాలు, షీల్డు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.1200 కోట్లు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సీఎం ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు ప్రమోషన్లు లేవని, 21వేల మంది ఉపాధ్యాయులకు తమప్రభుత్వం ప్రమోషన్లు కల్పించిందన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఇప్పటి వరకు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం వచ్చేలా ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలని కోరారు. గోపగాని సారయ్య గౌడ్ మాట్లాడుతూ 2015లో ఎంపీపీగా ఉన్నప్పుడు 1098 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి రూ.3 లక్షల విరాళంతో ఆంగ్ల పుస్తకాలు అందించినట్లు తెలిపారు. తహసీల్దార్ జగదీశ్వర్‌రావు, ఎంఈఓ సిరిమల్లె మహేష్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్ సబ్బని రాజమౌళి, డైరెక్టర్ ఎనగంటి రవి, హరికృష్ణ గౌడ్, గాజనవేన సదయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొర్రె పిల్ల అపహరణపై కేసు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామంలోని గొర్రెల మంద నుంచి గుర్తు తెలియని వ్యక్తులు గొర్రె పిల్లను అపహరించిన సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. తన గొర్రెల మంద నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.6 వేల విలువైన గొర్రె పిల్లను ఎత్తుకెళ్లారని బాధితురాలు బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

విద్యుత్ తీగ చోరీ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని రైతు ధర్మాగౌడ్‌కు చెందిన వ్యవసాయ విద్యుత్ తీగను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. గ్రామంలోని తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న రూ.30 వేల విలువైన విద్యుత్ తీగను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని రైతు ధర్మాగౌడ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి చేసినట్లు తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ఎక్స్‌కావేటర్, టిప్పర్ పట్టివేత

శంకరపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న ఎక్స్‌కావేటర్, టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు కేశవపట్నం పోలీసులు తెలిపారు. హుజూరాబాద్ మండలానికి చెందిన రాపోలు కుమార్, వేణు అనే వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఎక్స్‌కావేటర్, టిప్పర్‌తో మట్టి తరలిస్తుండగా కొత్తగట్టు శివారులో పోలీసులు పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కరీంనగర్ టాస్క్‌ఫోర్స్‌లో భారీ ప్రక్షాళన

తొమ్మిది మంది సిబ్బంది తొలగింపు

అవినీతి ఆరోపణలే కారణమా?

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్‌లో అక్రమ దందాలపై దాడులు, అక్రమార్కులను పట్టుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ సిబ్బందిలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇసుక అక్రమ దందా, పేకాట, వ్యభిచారం, గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు, మద్యం అక్రమ అమ్మకాలు, గుడుంబా, నాటుసారా, డ్రగ్స్, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, కల్తీ వంట నూనె, ఆహార పదార్థాలు వంటి దందాలపై ఉక్కుపాదం మోపి, నేరస్థులను కటకటాల్లోకి నెట్టేందుకు దశాబ్దాల కాలంగా టాస్క్‌ఫోర్స్ విభాగం కమిషనరేట్‌లో కొనసాగుతున్నది. పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ఈ టాస్క్‌ఫోర్స్ పోలీసు టీం పని చేస్తుంటుంది. పోలీస్ కమిషనర్‌తో పాటు స్పెషల్ బ్రాంచి, ఇతర విభాగాలకు అంది న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి నేరస్థుల ఆటకట్టిస్తుంటారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో నడుస్తున్న అక్రమ దందాలపై టాస్క్‌ఫోర్స్ నేరుగా దాడులు నిర్వహించి నిందితులను స్థానిక పోలీసులకు అప్పగిస్తుంది. స్థానిక పోలీ సులకు ఉన్న పరిచయాలతో కొన్ని సందర్భాల్లో కొన్ని అక్రమ దందాలను స్థానిక పోలీసులు పట్టించుకోరనే విమర్శలు న్నాయి. ఈ సందర్భంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి అక్రమ దందాలను అరికడ తారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు నేరుగా పోలీస్‌కమిషనర్‌కు అనుబంధంగా ఉంటారుకాబట్టి ఎలాంటి అవకతవకలకు తావు ఉండదనే భావన ఉంది.



సీపీ ప్రత్యేకంగా దృష్టి సారించి..

కరీంనగర్ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న కొంతమంది సిబ్బందిపై ఇటీవల అవినీతి ఆరోపణలు వచ్చినందునే సిబ్బందిని పూర్తిగా తొల గించినట్లు తెలుస్తోంది. టాస్క్‌ఫోర్స్‌లో ఒక ఏసీపీ, సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, ఏడుగురు కానిస్టేబుళ్లు పనిచేస్తున్నారు. ఇందులో ఎస్‌ఐ, ఏఎస్‌ఐతో సహా ఏడుగురు కానిస్టేబుళ్లను తొలగించిన పోలీస్ కమిషనర్ వారిని హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని సోమవారమే మౌఖిక ఆదేశాలే జారీ చేశారు. కొద్ది రోజుల కిందట నిషేధిత గుట్కాను భారీ ఎత్తున పోలీసులు పట్టుకున్నారు. అంతకు ముందు పీడీఎస్ బియ్యం, గంజాయి, పేకాట శిబిరాలపై దాడులు చేసిన సందర్భాల్లో కొంత అవకత వకలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ముఖ్యంగా పేకాట శిబిరాలపై దాడులు చేసిన సమయాల్లో కొందరిని తప్పించడం, నిర్వాహకులపై కేసులు నమోదు చేయ కపోవడం, డబ్బుల లెక్కల్లో కూడా తేడా రావడంపై ఆరోపణలు ఉన్నాయి. టాస్క్‌ఫోర్స్ దాడులు చేసిన ఘటనల్లో అవినీతికి పాల్పడినట్లు పోలీస్ కమిషనర్‌కు పక్కాగా సమాచారం ఉండడంతోపాటు, ఫిర్యాదులు కూడా అందినందునే ఈ చర్యలు తీసుకున్నారని తెలిసింది. కొద్ది రోజులుగా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కదలికలపై ప్రత్యేక పోలీసు లతో నిఘా పెట్టారు. ఆరోపణలు నిర్ధారణ అయిన వెంటనే తొమ్మిది మందిని తొలగించారు. టాస్క్‌ఫోర్స్ విధుల నుంచి తొలగించిన 9 మంది మంగళవారం ఏఆర్ ఆర్‌ఐకి రిపోర్ట్ చేశారు.

ముందుగానే సమాచారం లీక్

కొత్తగా టాస్క్‌ఫోర్స్‌లో నియామకాల కోసం అవినీతి మరకలు లేని సిబ్బందిని ఎంపిక ప్రక్రియ జరుగుతున్నది. గతంలో కూడా చాలా సంద ర్భాల్లో పేకాట శిబిరాలపై టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడి చేసిన సంద ర్భాల్లో నిందితులు అక్కడి కొన్ని నిమిషాల ముందే తప్పించుకునేవారు. సమా చారం అందించినవారికి అనుమానం కలిగే ది. అయినా ఏమీ చేయలేని పరిస్థితి. ఇంకా కొన్ని ఘటనల్లో సమాచారం అందించినవారి పేర్లు కూడా బయటకు వచ్చాయని చెబుతుండేవారు. స్థానిక పోలీసులకు ఉన్న ఒక రకమైన స్నేహం వల్లనే పట్టించుకోరనే వాదన ఉండేది. నిక్కచ్చిగా, నిజాయితీగా వ్యవహరిస్తారని భావిస్తున్న టాస్క్‌ఫోర్స్‌తో కూడా సరైన న్యాయం జరగడం లేదనే భావన కొందరిలో ఉంది. దీని కారణంగా అక్రమ కార్యకలా పాల గురిం చి, అసాంఘిక శక్తుల వివరాలు పోలీసులకు అందించేందుకు ఇది సమస్యగా మారు తుందని గుర్తించిన సీపీ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. కమిషనరేట్ పరిధిలోని పలు స్టేషన్లలో కూడా కొందరు సిబ్బంది ఇదే విధంగా వ్యవహరిస్తు న్నారనే ఆరోపణలున్నాయి. వీటిపై కూడా పోలీస్ కమిషనర్ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ట్రాఫిక్ జరిమానా చెల్లించిన పోలీసుశాఖ డ్రైవర్లు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఉల్లంఘనకు సంబంధించి పోలీసు శాఖ డ్రైవర్లు మంగళవారం జరిమానా చెల్లించారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడంతో పోలీసు వాహనాలకు చలాన్‌ల రూపంలో జరిమానాలు పడ్డాయి. ఈ జరిమానాలను వాహనం నడిపిన పోలీసుశాఖ డ్రైవర్లే చెల్లించాలని సీపీ గౌస్ ఆలం ఆదేశించారు. దీంతో కమిషనరేట్ వ్యాప్తంగా ఆయా వాహనాలకు చెందిన 25 మంది డ్రైవర్లు చలాన్ రూపంలో జరిమానా చెల్లించారు. పోలీసు అధికారులు, సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఆదర్శంగా ఉంటేనే ప్రజలు అనుసరిస్తారనే ఉద్దేశంతో ఈ చర్యలకు ఉపక్రమించారు.

అంధ విద్యార్థుల వీడియో ఆల్బమ్‌ను ఆవిష్కరించిన సీఎం

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థులు పాడి రూపొందించిన దివ్యదృష్టి వీడియో ఆల్బమ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ విద్యార్థులు రాగయుక్తంగా స్తోత్రాలను ఆలపించడం ఆనందాన్నిచ్చిందన్నారు. ఎంతో కృషి అభ్యాసం ఉంటే తప్ప ఇది సాధించలేరని, చిన్నారులు వృద్ధిలోకి రావాలని ఆశీర్వదించారు. కలెక్టర్ పమేలా సత్పతి విద్యారంగంలో చిన్నారులను ప్రోత్సహించడం ఆదర్శనీయమన్నారు. వీడియో ఆల్బమ్‌కు దర్శకత్వం వహించిన నంది శ్రీనివాస్, సంగీతాన్ని అందించిన కె.బి.శర్మ, సంగీత ఉపాధ్యాయిని సరళ, వీడియోగ్రఫీ చేసిన లక్ష్మీగౌతమ్‌ను సీఎం అభినందించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి సచివాలయాన్ని సందర్శించారు. కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి, చిన్నారి గాయకులు సింధుశ్రీ, శ్రావణి, తిరుమల, అఖిల, నిత్యశ్రీ, జాహ్నవి, కల్పన, ప్రణయ్, సాయిరామ్, మణిదీప్, అక్షయ్, వరుణ్‌తేజ్, మణిరతన్, లోహిత్, ప్రభుత్వ బధిరుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో కొత్తపల్లి వాసి మృతి



రాజయ్య(ఫైల్)

గంభీరావుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రాజయ్య (70) అనే వ్యక్తి గల్ఫ్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. రాజయ్య 15 ఏళ్లుగా సౌదీ వెళుతున్నాడు. ఈ నెల 13న రాజయ్య గుండెపోటుకు గురై మృతిచెందినట్లు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందింది. రాజయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

వాహనాల తనిఖీ

- సరైన పత్రాలు లేని 21 వాహనాలు సీజ్



వాహనాలు తనిఖీ చేస్తున్న డీటీవో

తిమ్మాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణాశాఖ, ట్రాఫిక్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నూతనంగా ఎంపికైన అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్లకు శిక్షణలో భాగంగా మంగళవారం వాహనాల తనిఖీ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు కరీంనగర్ జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ ఇతర పత్రాలు లేని 21 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. సుమారు 75వేల రూపాయల వరకు జరిమానా విధించినట్లు శ్రీకాంత్ చక్రవర్తి తెలిపారు. ప్రతి వాహనాదారుడు తమ వాహనాల పత్రాలను సరిచూసుకోవాలని సరియైన పత్రాలు లేనిదే రోడ్డు పైకి వస్తే జరిమానాతో పాటు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ సిఐలు పర్శ రమేష్, ఆర్‌ఐ కుమారస్వామి, ఎస్సైలు, ట్రైనీ ఏఎంవీఐలు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

● 43గ్రాముల గంజాయి, ద్విచక్రవాహనం స్వాధీనం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో మండల కేంద్రానికి చెందిన మామిడి శ్రీకాంత్ (27)ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్‌సీఐ మొగిలి తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ జల్సాలకు అలవాటు పడటంతో డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో గంజాయికి అలవాటుపడటమే కాకుండా వ్యాపారం చేయాలనుకున్నాడు. ప్రస్తుతం కరీంనగర్‌కు చెందిన అరవింద్ వద్ద గంజాయిని మూడు రోజుల క్రితం కొనుగోలు చేసి ఇంటికి తీసుకవచ్చాడు. కొంత గంజాయిని తాగి మిగిలిన దానిని అమ్మడానికి మంగళవారం ద్విచక్రవాహనంపై వెళుతుండగా జంగమరెడ్డిపల్లె కమాన్ వద్ద పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. శ్రీకాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా 43 గ్రాముల గంజాయి దొరికింది. గంజాయి, ద్విచక్రవాహనం, మొబైల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై లక్‌పతి పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో వేములవాడ అర్బన్ పరిధిలోని చింతల్‌ఠాణాకు చెందిన మంత్రి ఆనందంకు జీవిత ఖైదు రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ మంగళవారం తీర్పు వెల్లడించారు. ఎస్పీ మహేష్ బి. గీతే తెలిపిన వివరాల ప్రకారం.. జూలపల్లి మండలంలోని తేలుకుంటకు చెందిన మల్రిపెల్లి రాజయ్య(64) అనే వ్యక్తి వేములవాడ శివారులోని ఓ మామిడితోటలో తోటకాపరిగా ఉన్నాడు. ఇతనితో పాటు మంత్రి ఆనందం తోటకాపరిగా పనిచేస్తుండేవాడు. వీరి మధ్య తరచుగా తోటపని విషయంలో గొడవలు జరిగేది. ఈ గొడవల్లో భాగంగా ఏప్రిల్ 29,2024న రాత్రి అంతకుముందు తిట్టిన విషయంను ఆనందం మనసులో పెట్టుకొని ఇనుపరాడుతో రాజయ్య తలపై బాది హత్యచేశాడు. రాజయ్య కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు కానిస్టేబుల్ మహేందర్ నవీన్‌లు కోర్టులో 16మంది సాక్షులను ప్రవేశపెట్టారు. పీపీ పెంట శ్రీనివాస్ కేసు వాదించగా పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవితఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధించారు. శిక్ష పడటంలో కృషి చేసిన వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్‌ను, పీపీ పెంట శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ ఎస్‌ఐ రవీంద్రనాయుడు, కానిస్టేబుళ్లు మహేందర్, నవీన్‌లను ఎస్పీ అభినందించారు.

కొనుగోళ్ల కమీషన్‌లో అవకతవకలపై నిలదీత

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కొనుగోళ్లకు సంబంధించిన కమీషన్‌లో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయని, లెక్కలు చెప్పాలంటూ సభ్యులు, స్థానికులు మంగళవారం ఆందోళనకు దిగారు. వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామంలో మంగళవారం ఐకేపీ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటీవల గ్రామైఖ్య సంఘం వారు వరి ధాన్యం కొనుగోలు చేశారని అందుకు వచ్చిన కమీషన్ లెక్కలు చెప్పకుండా దాట వేస్తున్నారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమీషన్, ఇతర లెక్కలు తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ సమావేశాన్ని ఈ నెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నామని ఐకేపీ ఏపీఎం సుదర్శన్ వివరించడంతో శాంతించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మల్యాల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మల్యాల బ్లాక్ చౌరస్తా సమీపంలో మంగళవారం ఓ ఇంట్లో చోరీ జరిగింది. కట్టెకోల మల్లేశ్వరి అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రామన్నపేటలో తన అక్క ఇంటికి వెళ్లింది. మంగళవారం ఇంటికి రాగా వెనుకాల గేట్ గొలుసు పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూస్తే బీరువాలోని తులం బంగారు ఆభరణాలు, పది తులాల వెండితో పాటు రూ.10 వేల నగదు దొంగలు ఎత్తు కెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందిం చింది. ఎస్సై ఏ.నరేశ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.300 కోసం ఆటో డ్రైవర్ హత్య

● కిరాయి చెల్లింపు విషయంలో వాగ్వాదం ● వివరాలు వెల్లడించిన జగిత్యాల డీఎస్పీ రఘుచందర్



మృతుడు నయిముద్దీన్ (ఫైల్)



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం హైదర్‌పల్లి సమీపంలో రూ.300 కోసం ఆదివారం అర్ధరాత్రి ఆటో డ్రైవర్ నయిముద్దీన్(50)ను బీహార్‌కు చెందిన ఇద్దరు కూలీలు బండరాయితో మోది దారుణంగా హత్య చేశారు. నిందితులైన దర్శన్ సాహ్ని. సునీల్ సాహ్నిలను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో డీఎస్పీ రఘుచందర్ హత్య కేసు వివరాలను వెల్లడించారు. జగిత్యాల పట్టణంలోని సుతారిపేటకు చెందిన ఎండీ నయిముద్దీన్ పట్టణంలో ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన దర్శన్‌సాహ్ని, సునీల్ సాహ్ని, పంకజ్ అనే ముగ్గురు జగిత్యాల మండలం హైదర్‌పల్లి, పొలాస శివారులో గల రైస్ మిల్లుల్లో కూలీలుగా పనిచేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి జగిత్యాల నుంచి వారు పనిచేసే రైస్ మిల్లులకు వెళ్లేందుకు ముగ్గురు బీహార్ కూలీలు నయిముద్దీన్ ఆటోను అద్దెకు మాట్లాడుకున్నారు. పంకజ్ అనే బీహార్ కూలీ పొలాస దగ్గర దిగిపోయి ఆటో కిరాయి మిగిలిన వారు ఇస్తారని డ్రైవర్‌తో చెప్పాడు. ఆటో హైదర్‌పల్లిలోని రైస్‌మిల్లు సమీపంలోకి రాగానే ఆటో డ్రైవర్ నయిముద్దీన్ బీహార్ కూలీలైన దర్శన్ సాహ్ని. సునీల్ సాహ్నిలను కిరాయి డబ్బులు అడిగాడు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలోనే మాటామాటా పెరిగి ఆటోడ్రైవర్ నయిముద్దీన్ గొంతును టవల్‌తో దర్శన్ సాహ్ని అనే కూలీ బిగించగా మరో నిందితుడు సునీల్ సాహ్ని బండరాయితో దాడిచేసి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడేశారు. మృతుడు నయిముద్దీన్ సోదరుడు ఇసాక్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న జగిత్యాల రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా హత్య కేసును ఛేదించి నిందితులను పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి మృతుడు నయిముద్దీన్ మొబైల్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు.

యువతి ఆకస్మిక మృతి

జ్యోతినగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పర్మినెంటు టౌన్‌షిప్ (పీటీఎస్)లో మంగళవారం పొగిడి అనూష(29) అనే యువతి మృతి చెందింది. అనూష మృతిపై ఎన్టీపీసీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎన్టీపీసీ సంస్థలో అధికారిగా పనిచేస్తున్న పొగిడి జయరాజు పీటీఎస్‌లోని డి టైపు క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. జయరాజు కుమార్తె అనూష కొంత కాలంగా మానసికంగా ఇబ్బందిపడుతోంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కుమార్తె నిద్ర లేవకపోవడతో ఆమెను లేపే ప్రయత్నం చేశాడు. కదలికలు లేకపోవడంతో అనూషను టౌన్‌షిప్‌లోని ఎన్టీపీసీ ధన్వంతరి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆమెను పరిశీలించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు ప్రకటించారు. విషయాన్ని జయరాజు ఎన్టీపీసీ పోలీసుకు తెలిపారు. ఎన్టీపీసీ ఎస్‌ఐ టి.ఉదయ్‌కిరణ్ సంఘటన స్థలానికి వెళ్లి విచారించారు. అనూష మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

చోరీలకు పాల్పడుతున్న విద్యార్థి అరెస్టు

కోల్‌సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలావాటు పడి, డబ్బుల కోసం చోరీలకు పాల్పడుతున్న డిగ్రీ విద్యార్థి కప్పంపల్లి అరుణ్ కుమార్(20)ని మంగళవారం అరెస్టు చేసినట్టు డీసీపీ కరుణాకర్ పేర్కొన్నారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. గోదావరిఖని పట్టణంలోని విఠల్‌నగర్‌లో ఈ నెల 10, 11తేదీల్లో రాత్రి ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తి చోరీలకు పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనరెడ్డి ఎస్‌ఐలు, క్రైమ్ పార్టీ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఫైవింక్లయిన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న అరుణ్‌కుమార్‌ను పట్టుకున్నారు. అతన్ని విచారించగా తాను డిగ్రీ విద్యార్థినని, చెడు అలవాట్లకు బానిసై జల్సాలకు డబ్బుల కోసం చోరీలకు పాల్పడినట్టు తెలిపాడన్నారు. తాళం వేసిన ఇండ్లను గుర్తించి వెనుక డోర్లు పగులగొట్టి చోరీలకు పాల్పడేవాడన్నారు. దొంగిలించిన సొత్తును విక్రయించి జల్సాలు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. అతని వద్ద నుంచి 23.6గ్రాముల బంగారు ఆభరణాలు, 45తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సొత్తు విలువ రూ.1.93లక్షలు ఉంటుందని డీసీపీ పేర్కొన్నారు.

చోరీ సొత్తు కొన్నా, తాకట్టు పెట్టుకున్నా కేసులే..

చోరీ సొత్తును ఎవరైనా కొనుగోలు చేసినా, తాకట్టు పెట్టుకున్నా వారిపై కేసులు నమోదు చేస్తామని డీసీపీ పేర్కొన్నారు. ప్రైవేట్ గోల్డ్‌లోన్ కంపెనీలు తాకట్టు పెట్టుకునే సమయంలో అన్ని విచారణలు జరుపాలని, వివరాలు తీసుకోవాలన్నారు. అలా కాదని చోరీ సొత్తును తాకట్టు పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కేసును చేధించడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్‌ఐ అనూష, క్రైమ్ పార్టీ హెడ్ కానిస్టేబుల్ రమేష్, సదానందం, కానిస్టేబుళ్లు మధుకర్, మధుసూధన్, రమేష్‌లకు డీసీపీ క్యాష్ రివార్డు అందజేశారు. ఏసీపీ రమేష్, సీఐ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

ఇసుక కోసం వెళ్లి.. మానేరులో చిక్కుకొని

● కాపాడిన స్థానికులు, పోలీసులు

సుల్తానాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని గట్టెపల్లికి చెందిన కొందరు ట్రాక్టర్ యజమానులు, కూలీలు ఇసుక కోసం ట్రాక్టర్లతో మానేరు వాగులోకి మంగళవారం ఉదయం వెళ్లారు. కరీంనగర్‌లోని ఎల్‌ఎండీ నుంచి నీరు విడుదల చేసిన విషయం వారికి తెలియదు. మహిళతో పాటు ఎనిమిది మంది వాగులో ఇసుక నింపుతుండగా ఒక్కసారిగా నీటి ఉధృతి పెరగడంతో చిక్కుకుపోయారు. వారు బయటకు రాలేని దుస్థితి నెలకొంది. ప్రవాహంలో ట్రాక్టర్లు కొట్టుకుపోయాయి. బాధితులు పెద్దగా కేకలు వేయడంతో వాగు ఒడ్డున ఉన్న వారు సహాయక చర్యలు చేపట్టి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ మానేరు వాగు వద్దకు వచ్చి స్థానికుల సహాయంతో వాగులో ఉన్న వారిని తాళ్లతో బయటకు తీసుకువచ్చారు.



గట్టెపల్లి మానేరు వాగులో చిక్కుకున్న వారిని తాళ్లతో బయటకు తీస్తున్న స్థానికులు

● ఎవరూ వాగులోకి వెళ్ల వద్దు

ఎవరూ మానేరు వాగులోకి వెళ్లవద్దని సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ శ్రావణ్ కుమార్‌లు హెచ్చరించారు. మానేరు పరివాహక ప్రాంత గ్రామాలకు చెందిన ఇసుకను తరలించే ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు కూలీలతో సమావేశం నిర్వహించి మానేరు గేట్లు ఎత్తడంతో నీటి ఉధృతి పెరిగిందని ప్రమాదకరంగా ఉందన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

అర్కండ్ల వాగులో కొట్టుకుపోయి.. సురక్షితంగా ఒడ్డుకు



అర్కండ్ల వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తి

శంకరపట్నం: మండలం అర్కండ్ల లోలెవెల్ బ్రిడ్జిపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి జారిపడి నీటి ప్రవాహంతో కొంత దూరం కొట్టుకుపోయి సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్కండ్ల లో లెవెల్ బ్రిడ్జిపై నుంచి నీరు భారీగా ప్రవహిస్తుండగా ఓ వ్యక్తి నడుచుకుంటూ వాగు దాటే ప్రయత్నం చేశాడు. లో లెవెల్ బ్రిడ్జి నాచు పట్టి ఉండడంతో జారిపడి నీటి ప్రవాహంలో కొంత దూరం కొట్టుకుపోయాడు. ఆధారం దొరకగానే ఈదుకుంటూ బయటకు సురక్షితంగా చేరాడు. వాగుపై బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఇల్లందకుంట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి తలకు తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ క్రాంతి కుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మొగుళ్లపల్లి మండలంలోని పిడిసిల్ల గ్రామానికి చెందిన మాదం రత్నాకర్ (40) తన ద్విచక్ర వాహనంపై పిడిసిల్ల నుంచి కల్లుపల్లెకు ఈ నెల 12న వెళ్తుండగా బూజునూర్ గ్రామంలో కుక్కలు అడ్డు రాగా బైక్‌పై నుంచి జారి కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ క్రాస్‌రోడ్ వద్ద ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

భార్యను హతమార్చిన భర్త అరెస్టు

● పరారీలో అత్తమామలు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కరుణాకర్

కోల్‌సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం పన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లి ప్లాట్స్‌లో ఈ నెల 14న మేడి రమాదేవి అలియాస్ పూసాల ప్రశాంతి హత్య కేసులో నిందితుడు ఆమె భర్త పూసాల కృపాకర్ అలియాస్ ప్రభాకర్ (45)ను మంగళవారం అరెస్టు చేసినట్టు డీసీపీ కరుణాకర్ పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. ఈ నెల 14న ఉదయం ప్రశాంతిని ఆమె భర్త హత్య చేశాడని, గోదావరిఖని ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో రామగిరి ఎస్‌ఐలు శ్రీనివాస్, దివ్యలు ప్రత్యేక టీములతో నిందితున్ని లద్నాపూర్ వద్ద పట్టుకున్నారన్నారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు కృపాకర్ తల్లిదండ్రులైన శ్యామల, రంగయ్యలు పరారీలో ఉన్నారన్నారు. మంచిర్యాల రెడ్డి కాలనీకి చెందిన రమాదేవి అలియాస్ ప్రశాంతిని పన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లి ప్లాట్‌లో నివాసముండే పూసాల కృపాకర్ వేరు వేరు సామాజికవర్గాలకు చెందిన వారు 13ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడన్నారు. వీరికి కుమారుడు జాన్సన్(10), కుమార్తె జోషిత్(9), జ్యోత్స్న(7)లు ఉన్నారు. ఏడాదిగా వీరి మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. అప్పటి నుంచి భార్యభర్తలు వేరువేరుగా ఉంటున్నారు. ఈ నెల 14న రమాదేవి కృపాకర్ ఇంటికి వచ్చిందని, ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగిందన్నారు. రమాదేవిని చంపితేనే సమస్య పరిష్కారమవుతుందని భావించి కృపాకర్ ఆమెపై కత్తితో దాడి చేశారన్నారు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్టు డీసీపీ తెలిపారు. అత్తమామలు పరారీలో ఉన్నారని, విచారణ జరుగుతుందన్నారు. సమావేశంలో గోదావరిఖని ఏసీపీ రమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, రామగిరి ఎస్‌ఐ శ్రీనివాస్, దివ్య పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

- వాగులో కూర్చొని యువకుడి నిరసన



వాగు నీటిలో కూర్చున్న మోహన్

చందుర్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ఓ యువకుడు ఎనగల్ గ్రామంలో వాగులో కూర్చొని మంగళవారం ఆందోళన చేపట్టాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని ఎనగల్ గ్రామంలో పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల సమీపంలో వాగులో వంతెనలు నిర్మించాలని పుప్పాల మోహన్ అనే యువకుడు వాగులో కూర్చొని ఆందోళన చేపట్టాడు. వ్యవసాయ పనుల కోసం రైతులు, ఈత, తాటి వనానికి వెళ్లేందుకు గౌడ కులస్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఎస్సారెస్పీకి పెరిగిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్(ఎస్సారెస్పీ)కు మంగళవారం ఇన్‌ఫ్లో పెరిగింది. 37 గేట్లు పైకి ఎత్తి 2,58,705 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 77.40 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 8,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది.

శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద

పెద్దపల్లి: జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద కొనసాగుతున్నది. మంగళవారం సాయంత్రం వరకు 4,51,833 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, 38 గేట్ల ద్వారా గోదావరిలోకి 4,89,996 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. ఎస్సారెస్పీ నుంచి 2,32,128 క్యూసెక్కులు వస్తుండగా, కడెం నుంచి 14,964 క్యూసెక్కులు, పరివాహక ప్రాంతం నుంచి 2,04,741 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 19.064 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుంచి పెద్దఎత్తున వరద నీరు వస్తున్నదని, ఈ నేపథ్యంలో 5 నుంచి 6 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలిపెడుతున్నామని, పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగుండం సర్కిల్ 7 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి రవీంద్రాచారి కోరారు.

మిడ్ మానేరుకు..

బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి (మిడ్ మానేరు) ప్రాజెక్టుకు మంగళవారం 15161 ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 7450, మానేరు, ములవాగు ద్వారా 7741 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దిగువకు రెండు గేట్ల ద్వారా 8000 క్యూసెక్కులు, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు, ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.9 ఉండగా, సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.299 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండుపంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.07టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వస్తున్న 6400క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎల్‌ఎండీకి పెరిగిన వరద

తిమ్మాపూర్: వర్షాలతో ఎగువ నుంచి కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి వస్తున్న వరద పెరిగింది. సోమవారం వరకు కేవలం ఎల్‌ఎండీ స్పిల్‌వే రెండు గేట్లు ఎత్తి 4వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేసిన అధికారులు, ఇన్‌ఫ్లో పెరగడంతో మంగళవారం తెల్లవారు జామున 3 గంటలకు మరో 4 గేట్లు ఎత్తారు. మొత్తం 6 గేట్ల ద్వారా 14వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. మోయతుమ్మెదవాగు నుంచి 10,509 క్యూసెక్కులు, మిడ్ మానేరు నుంచి 7 వేల క్యూసెక్కులు, ఎగువ కాకతీయ నుంచి 800 క్యూసెక్కులు మొత్తం 18,309 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి వస్తోంది. పూర్తి స్థాయి నీటిమట్టం 24.034 టీఎంసీలు కాగా 23.602 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

చరిత్ర మరువని రోజు సెప్టెంబరు 17



తెలంగాణ చరిత్ర మరువని రోజు 1948 సెప్టెంబరు 17. అది నిజాం నిరంకుశత్వం తలవంచిన రోజు. రజాకార్ల ఆగడాలు అంతమైన రోజు. నాటి రెండు కోట్ల మంది తెలంగాణ ప్రజల హృదయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడిన పర్వదినం. ఈ నేలపై త్రివర్ణపతాకం ఎగిరిన రోజు. నిజాం రాచరిక పాలన ముగిసి, హైదరాబాద్ రాజ్యం భారత ప్రభుత్వంలో కలిసిన ఆ రోజు వెనుక అనేక ఘటనలు ఉన్నాయి. అందులో కొన్ని అంశాలు, ప్రముఖుల అభిప్రాయాలతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..


- హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి)

భయంతో ఆస్తులమ్మారు



పోలీసు యాక్షన్‌కు వారం ముందు 'బక్రీదుకు గొర్రెలను కాదు, హిందువుల తలలు నరుకుతాం. వాళ్ల రక్తంతో హోలి ఆడతాం' అని రజాకార్ నాయకుడు ఖాసీం రజ్వీ ప్రకటించినట్లుగా నగరమంతా వదంతులు వ్యాపించాయి. దాంతో హిందువులంతా భయంతో ఆస్తిపాస్తులు అమ్ముకొని బతికినన్నాళ్లు అయినా ఆనందంగా జీవించాలని విందులు చేసుకున్నారు. అదే సమయంలో భారత సైన్యం ప్రవేశించడంతో నిజాం లొంగిపోయాడని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. యుద్ధ ట్యాంకులు, వాహనాలకు పూలమాలలు వేసి, భారత జవానులకు లడ్డూలు తినిపిస్తూ సంబురాలు చేసుకున్నారు. ముస్లింలంతా రజాకార్లు కాదు. ఆ సమయంలో రజాకార్ల దాడినుంచి ఎంతోమంది హిందువులను ముస్లింలు కాపాడారు. ఈ విషయాలన్నీ ప్రత్యక్ష సాక్షి మా అక్కచెప్పగా నాకు తెలిశాయి.

- పరవస్తు లోకేశ్వర్, నగర చరిత్ర పరిశోధకుడు



ఈ ఘట్టానికి ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ

తెలంగాణ చరిత్రలోనే మరచిపోలేని సెప్టెంబరు 17 ఘట్టంలో ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ. 'మజ్లిస్ ఎ ఇత్తేహాద్ ఉల్ ముస్లిమీన్' నాయకుడు. ఆయన స్వస్థలం మరఠ్వాడాలోని ఉస్మానాబాద్ జిల్లా లాతూర్. అలీగఢ్‌లో న్యాయశాస్త్రం అభ్యసించిన అనంతరం హైదరాబాద్‌లో కొంతకాలం వకీలు మహమ్మద్ అలీ ఫాజిల్ దగ్గర సహాయకుడిగా పనిచేశాడు. తర్వాత సొంతూరుకు వెళ్లిన అతను మజ్లిస్ స్థానిక నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందాడు. యావదాస్తిని సంఘానికి రాసిచ్చి నాయకుల మనసులో ప్రత్యేక స్థానం సంపాదించాడు. కొద్దిరోజులకే సంస్థ పగ్గాలు చేపట్టాడు. సమయస్ఫూర్తి, వాగ్ధాటితో సామాన్యులను ఆకట్టుకున్న రజ్వీ నిజాం ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు. రజాకార్ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. హింసాత్మక ఘటనలకు కారకుడయ్యాడు. పోలీసు చర్య అనంతరం రజ్వీని భారత సైన్యం అరెస్టుచేసి తిరుమలగిరి సైనిక కారాగారంలో నిర్బంధించింది. 1957, సెప్టెంబరు11న విడుదలయ్యాడు. అదే నెల18న నగరం నుంచి ముంబైకు, అక్కడి నుంచి పాకిస్థాన్‌కు వెళ్లిపోయాడు. కరాచీలో ఒక అనామకుడిగా జీవనం సాగిస్తూ న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టాడు. ఒకనాడు ఈ నేలను శాసించాలనుకున్న ఇత్తేహాదుల్ సారథి 1970, జనవరి15న ఓ సాధారణ వ్యక్తిగా కన్నుమూశాడు.

నిజాం ప్రధానిమీదా రజాకార్ల దాడి

నిజాం నిరంకుశ పాలనలో సామాన్యుల మానప్రాణాలను హరించిన రజాకార్లు నిజాం ప్రధాని మీదా దాడి చేయడం కొంత మందికే తెలుసు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఓ ఆస్పత్రి ఆవరణలో తలెత్తిన ఘర్షణలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలన్న కాంక్షతో కొంతమంది రజాకార్లు ఆనాటి ప్రధాని అధికారిక నివాసం షా మంజిల్(ప్రస్తుతం రాజ్‌భవన్)ను ముట్టడించారు. లోపల గృహోపకరణాలకు నిప్పుపెట్టారు. అంతటితో ఆగక ప్రధానమంత్రిపై సైతం దాడికి పాల్పడ్డారని మందుముల నరసింహారావు జ్ఞాపకాల్లో ప్రస్తావించారు.

దక్కన్ రేడియోలో స్వాతంత్ర్య ప్రకటన

భారత ఆర్మీ 1948, సెప్టెంబరు18న నగరానికి చేరింది. అంతకు ఒకరోజు ముందు రోజు సెప్టెంబర్17న ఖాసీం రజ్వీ హైదరాబాద్‌లో నరమేధానికి వ్యూహం పన్నాడు. ఈ విషయం తెలిసి ఉస్మానాబాద్ కలెక్టర్ మొహమ్మద్ హైదర్ ఆనాటి నిజాం పోలీసు ఉన్నతాధికారి నవాబ్ దీన్‌యార్‌జంగ్ దగ్గరకు పరుగుతీశాడు. ఇరువురు ఫోన్‌ద్వారా రజ్వీకి నచ్చజెప్పి కల్లోలాన్ని ఆపించారు. ఈ విషయాన్ని మొహమ్మద్ హైదర్ జ్ఞాపకాల్లో రాశారు.

అంతకు ముందురోజే సైన్యాధ్యక్షుడు ఎల్.ఇద్రూస్ నిజాంను కలిసి సైన్యాన్ని ప్రతిఘటించడం వల్ల మరింత ప్రాణ నష్టం మినహా మరేమీ లేదని విన్నవించాడు. దీంతో సెప్టెంబరు17న మొదట ఖాసీం రజ్వీ ఖైరతాబాద్‌లోని దక్కన్ రేడియో ద్వారా తన ఓటమిని అంగీకరించాడు. ఆ తర్వాత కేఎంమున్షీతో కలిసి దక్కన్ రేడియోకు చేరుకున్న నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్... భారత సైన్యాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొన్ని వందల ఏళ్ల రాచరిక పాలన నుంచి ఈ నేలకు స్వాతంత్ర్యం సిద్ధించింది. ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంబురాలు చేసుకున్నారు. నగర వీధుల్లో జాతీయ జెండా ఎగరేశారు.

అమరుల త్యాగాలను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

తిమ్మాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాటి అమరుల త్యాగాలను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా చాడ వెంకటరెడ్డి మండలంలోని పోలంపల్లిలో ఏర్పాటు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు అనభేరి ప్రభాకర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనభేరి ప్రభాకర్‌రావు సొంత గ్రామమైన పోలంపల్లిలో సీపీఐ పక్షాన



పోలంపల్లిలో సీపీఐ ర్యాలీలో చాడ వెంకట్‌రెడ్డి

భారీ ర్యాలీ నిర్వహించి ఆయనకు నివాళులర్పించడం గర్వంగా ఉందని అన్నారు. 10 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందని తెలిపారు. అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహాన్ని హైదారాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, మండల కార్యదర్శి బోయిని తిరుపతి, నాయకులు సూరం మల్లేశం, పిట్టల శ్రీనివాస్, ఎల్లాస్వామి, బండారి రమేష్, తిరుపతిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో సబ్బండ వర్గాలకు సమన్యాయం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రభుత్వంలో సబ్బండ వర్గాలకు సమన్యాయం జరుతుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాదిగల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్ అధ్యక్షతన మాదిగల ఆత్మీ సమ్మేళన సభ జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో మంత్రిని మాదిగ నాయకులు ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రాహుల్‌గాంధీ, ఖార్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ మాదిగల పక్షాన మంత్రిగా తనకు అవకాశం ఇచ్చారన్నారు. నేరెళ్ల సంఘటనపై ఆరోజు కాంగ్రెస్ నాయకులం కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించామన్నారు. నాటి స్పీకర్ మీరా కుమారి స్వయంగా వచ్చి నేరెళ్ల బాధితులను పరమర్శించినప్పుడు బాధితుల ఆవేదన కన్నీల్లు పెట్టించిందన్నారు. కేటీఆర్, సంతోష్‌రావు తదితరులు విచక్షణా రహితంగా నేరెళ్ల ఘటనలో దళితులపై దాడులు చేయించారని ఆరోపించారు.

అసెంబ్లీలో ముఖ్యమైన ఘట్టం వర్గీకరణ చట్టంను అమలు చేస్తుంటే చట్టసభకు రాకుండా ఫాంహౌస్‌కు పరిమితం అయ్యాడని ఆరోపించారు. దళితులకు చెందాల్సిన భూములు వారికిచ్చే బాధ్యతను తీసుకుంటామన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రంపేట చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే కర్రోల్ల నర్సయ్య విగ్రహం ఏర్పాటు, అదేవిధంగా జిల్లా కేంద్రంలో అంబేద్కర్ ఫంక్షన్‌హాల్‌ను నిర్మాణం చేయాలన్న నాయకుల ప్రతి పాదనను పరిశీలిస్తామన్నారు. రగుడు వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండుగులపై చర్యలు తీసుకోవాలని దళిత నాయకుడు రాగుల రాములు విజ్ఞప్తిని ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, మాజీవిప్ ఆరెపెల్లి మోహన్, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య పాల్గొన్నారు.

ఆర్టీఐ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలి

● రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్ డాక్టర్ జి చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రధాన కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమాచార హక్కు చట్టం-2005ను అధికారులు కట్టుదిట్టంగా అమలుచేయాలని రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్ డాక్టర్ జి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమాచార అధికారులకు ఆర్టీఐ చట్టం అమలులో ఉన్న సందేహాలను అడిగి నివృత్తి చేశారు. సమాచార హక్కు చట్టం సంబంధించి జిల్లాలో పెండింగ్ ఉన్న 134 కేసులను కమిషన్ సభ్యులు పరిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి, మొదటి అప్పిలేట్ అథారిటీ, రెండో అప్పిలేట్ అథారటీ పేర్లు, ఫోన్ నంబర్లతో కూడిన బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ప్రజలు కోరిన సమాచారం నిర్ణీత సమయంలో అందించాలన్నారు.

జవాబుదారీతనం పెరిగింది

సమాచార హక్కు చట్టం కారణంగా ప్రభుత్వ పాలనలో పారదర్శకత జవాబుదారీతనం పెరిగిందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మండల స్థాయిలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రతి కార్యాలయానికి వచ్చే ఆర్టీఐ దరఖాస్తుకు సకాలంలో సమాధానం అందించేలా అధికారులకు ఆదేశాలు అందించామన్నారు. సమాచార హక్కు చట్టం కమిషనర్లు దేశాల భూపాల్, పీవీ శ్రీనివాసరావు, అయోధ్యరెడ్డి, మొహసిన పర్వీన్‌లు మాట్లాడుతూ ఆర్టీఐ చట్టం ప్రజల్లో తీసుకుని వెళ్లేందుకు వారధులుగా ప్రభుత్వ అధికారులు సిబ్బంది పని చేయాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ అదనపు ఎస్పీలు చంద్రయ్య, శేషాద్రినిరెడ్డి, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాబాయి, జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఫస్ట్ అప్పీలేట్ అధికారులు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-17 బాక్సింగ్, ఉషు పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల బాక్సింగ్, ఉషు పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 8 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్, బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్ తెలిపారు. బుధవారం అండర్- 17 బాల బాలికల విభాగాల్లో బాక్సింగ్ పోటీలు, గురువారం ఉషు పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు.

ఆసక్తి గల క్రీడాకారులు హెచ్‌డీఎఫ్ ఎలిజిబిలిటీ ఫాం, ఆధార్ కార్డు జిరాక్స్, బోనఫైడ్ సర్టిఫికెట్‌తో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

రామగుండం ఎన్టీపీసీకి రాజ్‌భాష జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎన్టీపీసీ ఏజీఎం విజయ్‌కుమార్ సిక్దర్

జ్యోతినగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీకి రాజ్‌భాష జాతీయ అవార్డు లభించింది. అధికారిక భాషా విధానం అమలులో విశేష కృషి చేసినందుకుగాను 2024-25 సంవత్సరానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రామగుండం ఎన్టీపీసీ రాజ్‌భాష కమిటీని జాతీయ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు మంగళవారం గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్‌ఆర్) విజయ్ కుమార్ సిక్దర్ అవార్డును అందుకున్నారు. ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్ సామంత నాయకత్వంలో హిందీ భాషను ప్రోత్సహించడం, ప్రచారం చేయడంలో రాజ్‌భాష కమిటీ అంకితభావంతో పని చేసిందని యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది.

ధర్మపురిలో ఘనంగా ఉట్టి వేడుకలు

ధర్మపురి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):ధర్మపురి క్షేత్రంలోని ఇసుక స్తంభం వద్ద మంగళవారం ఉట్టి వేడుకలు నిర్వహించారు. స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శెరారితో ఇసుక స్తంభం వరకు వెళ్లి ఉట్టి కొట్టి వేడుకలు నిర్వ హించారు. కార్య క్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మం డలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, ధర్మ కర్తలు ఏదులాపురం మహేందర్, రాపర్తి సాయి కిరణ్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ పాల్గొన్నారు. మంగళ వారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



ఉట్టి వేడుకల్లో పాల్గొన్న అర్చకులు, సిబ్బంది

రేపటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ కళాశాలల క్రీడలు



కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూనియర్ కళాశాలల అండర్-19 ఎస్‌జీఎఫ్ క్రీడల షెడ్యూల్‌ను మంగళవారం డీఐఈవో వి.గంగాధర్, పోటీల నిర్వహణ కార్యదర్శి జి.మధుజాన్సన్ ప్రకటించారు. ఈ పోటీలను ఉమ్మడి జిల్లాస్థాయిలో గురువారం నుంచి నవంబరు 7 వరకు నిర్వహించనున్నారు. మొత్తం 37 క్రీడాంశాలలో నిర్వహించే ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు అర్హత పారంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, బోనఫైడ్ సర్టిఫికెట్, పదో తరగతి మెమో జిరాక్స్ కాపీలను జపరచాల్సి ఉంటుంది. ఈ పత్రాలపై కళాశాలల ప్రిన్సిపాల్ సంతకంతో హాజరుకావాలి. మంగళవారం నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు, సత్యవర్ధన్ రావు, ఆంజనేయరావు, రాజేశ్వరరావు, శశిధర్‌శర్మ, నిర్మల, వెంకటరమణాచారి, బల్వీందర్‌సింగ్ పాల్గొన్నారు.

క్రీడల షెడ్యూల్

జగిత్యాలలోని పొన్నాల గార్డెన్స్‌లో గురువారం బాలబాలికల విభాగంలో తై క్వాండో, కరాటే, బాక్సింగ్, థైక్వాండో మార్షల్ ఆర్ట్స్, 19న కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో ఉన్నత పాఠశాలలో బాల బాలికలకు చెస్, యోగాసన పోటీలు నిర్వహించనున్నారు. 20న కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో బాలురకు ఫుట్‌బాల్, అనంతరం అక్టోబరు 6న కొత్తపల్లి అల్ఫోర్స్ ఈటెక్నో పాఠశాలలో బాల బాలికలకు ఉషు, జూడో, 7న అల్ఫోర్స్ ఈటెక్నో పాఠశాలలో బాలురకు కబడ్డీ పోటీలు, 8న టీజీడబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల చింతకుంటలో బాలికలకు కబడ్డీ, 9న తిమ్మాపూర్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో బాలురకు వాలీబాల్, 10న టీజీడబ్ల్యూఆర్ఎస్ చింతకుంట జూనియర్ కళాశాలలో బాలికలకు వాలీబాల్, 13న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో బాలబాలికలకు అథ్లెటిక్స్, 17న జగిత్యాలలోని మినీ స్టేడియంలో బాలబాలికలకు క్రికెట్, 18న కొత్తపల్లి అల్ఫోర్స్ ఈటెక్నోలో బాలబాలికలకు నెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, 23న గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో బాల బాలికలకు వెయిట్ లిఫ్టింగ్, స్కేటింగ్ పోటీలు ఉంటాయి.

24న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో బాలురకు ఖో-ఖో, 25న అంబేద్కర్ స్టేడియంలో బాలికలకు ఖో-ఖో, 26న కొత్తపల్లి తేజస్ జూనియర్ కళాశాలలో బాల బాలికలకు బాస్కెట్ బాల్, 28న జగిత్యాల మినీ స్టేడియంలో బాలబాలికలకు ఫెన్సింగ్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, 29న కొత్తపల్లి అల్ఫోర్స్ ఈటెక్నోలో బాలబాలికలకు స్విమ్మింగ్, 31న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో బాలబాలికలకు హాకీ, నవంబరు 4న కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో బాలబాలికలకు సైక్లింగ్, 6న కొత్తపల్లి తేజస్ జూనియర్ కళాశాలలో బాలబాలికలకు ఆర్చరీ, 7న జగిత్యాల మినీ స్టేడియంలో బాలబాలికలకు రగ్బీ పోటీలు, జగిత్యాల క్లబ్‌లో బాలబాలికలకు షటిల్ బ్యాడ్మింటన్, షూటింగ్, జగిత్యాల మినీ స్టేడియంలో బాలబాలికలకు ఫుట్‌బాల్ పోటీలను నిర్వహిస్తారు.



పరవళ్లు తొక్కుతున్న ఎగువ మానేరు

గంభీరావుపేట మండలం నర్మాల మానేరు ప్రాజెక్టు మళ్లీ పరవళ్లు తొక్కుతోంది. రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కూడవెల్లి, పల్వంచ వాగులు పొంగుతున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మానేరు జలాశయానికి వరద నీరు భారీగా వస్తోంది. ఎగువ మానేరు మత్తడి మీదుగా పరవళ్లు తొక్కుతోంది. దీంతో మానేరు వాగు బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తుండటంతో సిద్దిపేట-కామారెడ్డి మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి.

- గంభీరావుపేట, ఆంధ్రజ్యోతి

పట్టణ వ్యాపారులతో కమిషనర్ సమావేశం

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) పట్టణంలో ఉన్న వ్యాపార వాణిజ్య సంస్థల యజమానులతో మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ మంగళవారం సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణాభివృద్ధి ధ్యేయంగా ఇటీవల కాలంలో అమర్‌నగర్ నుంచి మసీద్ వరకు, దేవిడికోట నుంచి చాకలి ఐలమ్మ విగ్రహం, జెండా చౌరస్తా, సుభాష్ విగ్రహం వరకు బీటీ రోడ్లతో సుందరీకరించామన్నారు. జెండా చౌరస్తా నుంచి పెద్ద మసీద్ వరకు (మెయిన్ రోడ్డు) అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో సలహాలు, సూచనలు తీసుకుంటున్నామన్నారు. దీనికి పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని కోరారు. ఏఈ సతీష్, టౌన్ ప్లానింగ్ అధికారులు నరేష్, వినయ్, కిరణ్, పెద్దపల్లి పట్టణ వ్యాపార, వర్తక దుకాణ యజమానులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'ఉపాధి' కల్పించాలి


సమావేశంలో పాల్గొన్న అధికారులు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అర్హులైన వారందరికీ జాబ్ కార్డులు అందజేసి ఉపాధిహామీలో పని కల్పించాలని అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 24 గ్రామ పంచాయతీల్లో చేసిన పనులపై చర్చించారు. మండలంలో రూ.4కోట్ల45లక్షల49వేలు ఖర్చు చేసినట్లు తెలిపారు. అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లకు నోటీసులు ఇవ్వాలని, డబ్బులు రికవరీ చేయాలని ఆదేశించారు. ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. విరివిగా మొక్కలు నాటాలని, చేసి న ప్రతీ పనిని ఎంబీ రికార్డు చేయాలని అన్నారు. గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు సరిగా పని చేయాలని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. విజిలెన్స్ అధికారి కొమురయ్య, ఎంపీడీవో పూర్ణచందర్, ఏపీఎం మంజుల, ఎస్ఆర్పీ బాలు, పీఆర్ ఏఈ పవన్, అధికారులు మల్లికార్జున్, శరత్, హరికృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ధ్వంసంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): మొట్లపల్లి గ్రామంలో పొలాలకు వెళ్లే రోడ్డు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించడంతో పూర్తిగా ధ్వంసమైందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం తహసీల్దార్ జగదీశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సుమారు 30కి పైగా ట్రాక్టర్లు మానేరు నుంచి ఇసుక తరలిస్తున్నాయని, పొలాలకు వెళ్లే పైపులైన్లు ధ్వంసం కావడంతోపాటు రోడ్డు గుంతలమయంగా మారిందని తెలిపారు. ట్రాక్టర్ల యజమానులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులు మోహన్ రెడ్డి, బండి ఓదెలు, బేజ్జాల రామస్వామి, రాగుల మొగిలి, రఫీ, రూపిరెడ్డి రాంరెడ్డి, చుక్క రాజు, గట్టయ్య పాల్గొన్నారు.

కరాటేలో ఐపీఎస్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

సుల్తానాబాద్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు సౌత్ ఇండియా కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 14న కరీంనగర్‌లో జరిగిన పోటీల్లో స్పారింగ్, కటా విభాగంలో సాయి, మణిదీప్, సృజన్ బంగారు, తరుణ్, అభిరామ్, శ్రీతన్ రజత పతకాలు సాధించారు. కటా విభాగంలో మైత్ర, వరుణ్ కాంస్య పతకాలు అందుకున్నారు. పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ విద్యార్థులను అభినందించారు. కరాటే మాస్టర్ కనకేష్ పాల్గొన్నారు.

బీజేవైఎం కాలనీ అధ్యక్షుడిగా అనిల్‌కుమార్

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా యువమోర్చా కాలనీ మండల అధ్యక్షుడిగా ఐలవేన అనిల్ కుమార్ నియమిస్తున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు ఆకుల శశికుమార్ ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా ఆకుల అఖిల్ గౌడ్‌ను నియమించినట్టు పేర్కొన్నారు.

రేపు మెగా వైద్యశిబిరం

పాలకుర్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్‌నగర్ అల్ట్రాటెక్ వర్కర్స్ క్లబ్ ఆవరణలో గురువారం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్, మక్కాన్ సింగ్ సేవ సమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. శిబిరాన్ని విజయవంతం చేయాలని కన్నాల ప్యాక్స్ చైర్మన్ బయ్యపు మనోహర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పర్శవేణి శ్రీనివాస్ యాదవ్ మంగళవారం పిలుపునిచ్చారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5వరకు శిబిరం ఉంటుందని పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలుకు సన్మానం


మమతను సన్మానిస్తున్న ఎంఈవో

ఎలిగేడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధూళికట్టలోని గాయత్రి విద్యానికేతన్ ప్రైవేటు పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు కూసి మమత ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. మంగళవారం సుల్తాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆమెను సన్మానించారు. ఎంఈవో అనసూరి నరేంద్రచారి, గాయత్రి విద్యానికేతన్ కరస్పాండెంట్ పద్మకర్ రాజు, సిబ్బంది అభినందించారు.

ముదిరాజ్ సంఘం కార్యవర్గం

మంథనిరూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా ఊదరి లచ్చయ్యను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్య క్షుడిగా ఊదరి బానయ్య, ప్రధాన కార్యదర్శిగా సాదుల తిరుపతి, కోశాధికారిగా బొంతల రాజశేఖర్, ఊదరి శంకర్, కొంతం రాజు, మబ్బు బానయ్య, సాదుల చంద్రయ్య, భూలక్ష్మి దేవాలయ కమిటీ చైర్మన్‌గా ఊదరి లక్ష్మణ్, వైస్ చైర్మన్‌గా మబ్బు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సాదుల తిరుపతి, కోశాధికారిగా సాదుల శంకర్ ఎన్నికయ్యారు.

మదర్‌థెరిస్సా అవార్డుకు ఎంపిక

కమాన్‌పూర్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నారగోని సతీష్ గౌడ్ మదర్‌థెరిస్సా అవార్డుకు ఎంపికైనట్లు వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్ వసుంధర విజ్ఞాన వికాస మండల వ్యవస్థాపక అధ్యక్షుడు చదువు వెంకట్ రెడ్డి తెలిపారు. ఈనెల 22న హైదరాబాద్ రవీంద్రభారతిలో అందజేయనున్నట్లు తెలిపారు.

ఐఎన్‌టీయూసీ నాయకుడి ఇంట్లో చోరీ

కోల్‌సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కేసీఆర్ కాలనీలో నివాసముండే ఐఎన్‌టీయూసీ నాయకుడు, సింగరేణి ఉద్యోగి గడ్డం కృష్ణ ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. కుమారుని చికిత్స నిమిత్తం కుటుంబం హైదరాబాద్‌కు వెళ్లింది. సోమవారం రాత్రి తిరిగి వచ్చే సరికి ఇంటి ముందు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న 12తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. రాత్రి 11గంటలకు కృష్ణ కుటుంబ సభ్యులు రావడాన్ని గమనించిన దొంగలు వెనుకవైపు నుంచి పరారైనట్టు తెలుస్తున్నది. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. పోలీసులు విచారిస్తున్నారు.

ఓజోన్ పరిరక్షణ దినోత్సవం

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవ వేడుకలను పట్టణంలోని గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఓజోన్ పొర ప్రయోజనాలు, పొర క్షీణతకు గల కారణాలు చార్ట్ ద్వారా వివరించారు. చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ సూర్యుని నుంచి వచ్చే కిరణాలను భూమి మీద నేరుగా పడకుండా ఓజోన్ రక్షణగా నిలిస్తుందని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ, తెలంగాణ ఎన్టీపీసీలో మంగళవారం ప్రపంచ ఓజోన్ డేను నిర్వహించారు. ఎన్టీపీసీ ఈఎంజీ విభాగం ఆధ్వర్యంలో పీటీఎస్ కాకతీయ ఫంక్షన్ హాల్ సమీపంలో జరిగిన కార్యక్రమానికి ఈడీ చందన్ కుమార్ సామంత హాజరయ్యారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, ఓజోన్ పరిరక్షణకు


చార్ట్‌పై వివరిస్తున్న విద్యార్థినులు

ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈడీ కోరారు. జీఎంలు ముకుల్‌రాయ్, మీనేస్ అగర్వాల్, విజయ్ జోస్, అవిజిత్ దత్తా, సిబ్బంది పాల్గొన్నారు.

సేవా పక్వాడాను విజయవంతం చేయాలి

జ్యోతినగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను బుధవారం నుంచి రామగుం డంలో నిర్వహిస్తున్నామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, రాష్ట్ర నాయకుడు మెరుగు హన్మంతు గౌడ్ తెలిపారు. మంగళవారం ఎన్టీపీసీలో జరిగిన కార్యక్ర మంలో మాట్లాడుతూ సే వా పక్వాడా పేరుతో 15 రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 17న అన్ని మండల కేంద్రాలలో రక్తదాన శిబిరాలు, 18న ఆత్మ నిర్భర్ భారత్, వికసిత్ భారత్ అంశాలపై చిత్రలేఖనం పోటీలు, మండల కేంద్రాలలో మహిళా మోర్చా ఆధ్వర్యం లో శక్తి కేంద్రాలలో స్వచ్ఛ భారత్, 21న నమో మారథాన్ రన్, 25న మొక్కలు నాటే కార్యక్రమం, 27న దివ్యాంగులకు సన్మానం, 28న విశిష్ట వ్యక్తులకు సన్మానం, అక్టోబరు 2న మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిలకు నివాళి కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు సుభా ష్, నరేష్, అపర్ణ, రమేష్, పవన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

కమాన్‌పూర్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయ సాధకుడు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పెంచికల్‌పేటలోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహావిష్కరణ పేరిట దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. గ్రామంలో రాజకీయ చిచ్చు పెట్టేందుకు ఇలాంటి కుట్రలు చేయడం సరైంది కాదన్నారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇరుగురాల శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సయ్యద్ అన్వర్, ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, పీఏసీఎస్ చైర్మన్ భాస్కర్ రావు, మాజీ ఎంపీపీ రాంచంద్రం గౌడ్, నాయకులు రఫీక్, దాసరి గట్టయ్య, మల్యాల తిరుపతి, కుక్క రవీందర్, చంద్రమౌళి, భూంపెల్లి రాజయ్య, గడప కృష్ణమూర్తి, పిన్‌రెడ్డి కిషన్ రెడ్డి, బొల్లపల్లి శంకర్ గౌడ్, రెబల్ రాజు, లింగాల రాజయ్య, పాల్గొన్నారు.

విమోచన దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ఎలిగేడు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న తెలంగాణ విమోచన దినోత్సవం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా కార్యదర్శి న్యాతరి పోచయ్య పిలుపునిచ్చారు. ఎలిగేడులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిజాం పరిపాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతూ అరాచకాలు సహించలేక ఎదురు తిరిగి పోరాడి సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన జరిగిందని తెలిపారు. సీనియర్ నాయకుడు కవ్వంపల్లి బాపయ్య, మండల అధ్యక్షుడు కవ్వంపల్లి రాము, బింగి రాజు, కట్ల ప్రతాప్, కచ్చు రాయుడు, భూసార రమేష్, గొల్లె లక్ష్మణ్, చెవుల అజయ్, పిల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీపీవోల నియామకం

పెద్దపల్లి రూరల్ , సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల రెవెన్యూ వ్యవస్థలో క్షేత్రస్థాయి అధికారులు సేవలు అందించేందుకు గ్రామాల వారిగా జీపీవోలను నియమించిట్లు తహసీల్దార్ రాజయ్య పేర్కొన్నారు. 30 గ్రామాలతో పాటు మున్సిపల్‌ను కలుపుకొని మొత్తం 18 క్లస్టర్‌లు విభజించి 18 మంది గ్రామ పరిపాలన అధికారులను కేటాయించినట్లు తెలిపారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామాలకు ఆరుగురు గ్రామ పాలనాధికారులు విధుల్లో చేరారు. ఆరు క్లస్టర్ గ్రామాలకు ధూళికట్ట, నేతకానిపల్లి జీపీఓగా అనిల్ కుమార్, ఎలిగేడు, లాలపల్లి, నారాయణపల్లి గ్రామాలకు సరిత, ముప్పిరితోట, లోకపేటకు సదానందం, నర్సాపూర్, శివపల్లికి రాకేష్, సుల్తాన్‌పూర్, బుర్హాన్‌మియాపేటకు స్వామి, ర్యాకల్‌దేవుపల్లి, రాములపల్లి జీపీఓగా షఫీలు చేరారు.

నిధుల మంజూరుపై మంత్రి హర్షం

ధర్మారం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించడంపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హర్షం వ్యక్తంచేశారు. ధర్మారం మండల కేంద్రంలోని తెనుగువాడ నుండి ఎండపల్లి ఎక్స్‌రోడ్ వరకు బీటీ రోడ్డు పనులకు మూడు కోట్ల ఇరవై లక్షలు, పెగడపల్లి మండలం మద్దులపల్లి పంచాయతీరాజ్ బ్రిడ్జి నుంచి పందుల గుట్ట వరకు 2 కోట్లు రూపాయలు మంజూరయ్యాయి. మంత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

మంథనిరూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎక్లాస్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శాస్త్రులపల్లి గ్రామా నికి చెందిన మాజీ సర్పంచ్ లోడారి ప్రమీల (50) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. 1995-2000 వరకు ఎక్లాస్‌పూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ప్రమీల పని చేశారు. ప్రమీల మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సందర్శించి నివాళులర్పించారు. ఆమె భర్త లోడారి రాములు సైతం సర్పంచ్, ఎంపీటీసీగా పని చేశారు.

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడిగా మధు

పెద్దపల్లి రూరల్ , సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మాల మహనాడు జిల్లా అధ్యక్షుడిగా కనగర్తి గ్రామానికి చెందిన కట్టెకోల మధును నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పేర్కొన్నారు. అధ్యక్షునితో పాటు ప్రధాన కార్యదర్శిగా ఆముల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోచం మల్లయ్య, ఉపాధ్యక్షులుగా మద్దెల రామకృష్ణ, మట్ట రాజయ్య, కార్యదర్శులుగా చెవుల రాజయ్య, బండరాజుని నియమించినట్లు తెలిపారు.

సాయుధ పోరాటంలో అలుపెరుగని యోధులు

(5వ పేజీ తరువాయి)

(5వ పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌గా పని చేయగా, పనకంటి కిషన్‌రావు జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేసి స్వర్గస్థులైనారు.

పోరాట యోధులకు గుర్తింపు..

నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటానికి చిహ్నంగా గుంజపడుగు, దామెరకుంట, ఒడిపిలవంచ గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం స్థూపాలను ఏర్పాటు చేసింది. అప్పటి ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ మంథని స్వాతంత్ర్య సమరయోధులను ఢిల్లీలో సన్మానించి పెన్షన్లు, స్వాతంత్ర్య సమరయోధుల ధ్రువీకరణ ప్రతాలను ప్రదానం చేశారు.

స్మృతి చిహ్నం ఏర్పాటు చేయాలి..

తెలంగాణ విమోచన కోసం సత్యాగ్రహ, సాయుధ ఉద్యమంలో పని చేసిన స్వాతంత్ర సమరయోధుల వివరాలు, వారి పోరాటాలు, త్యాగాలను భావితరాలకు అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మంథనిలో స్మృతి చిహ్నాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని స్వాతంత్ర్య సమరయోధుల వారసులు గులుకోట శ్రీకాంత్, శశిభూషన్‌కాచే, చొప్పకట్ల రాము, శ్రీకాంత్‌లు కోరుతున్నారు.

నేడు ప్రజాపాలన దినోత్సవం

పాలకుర్తి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో బుధవారం ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం 13 నెలల పాటు నిజాం నిరంకుశ పాలన కొనసాగింది. చివరికి 1948 సెప్టెంబరు 17న భారత ప్రభుత్వం సైనిక చర్య ద్వారా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా పేర్కొంటుంది.

కిక్ బాక్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పెద్దపల్లి రూరల్ , సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ లీగ్ పోటీల్లో బ్రాహ్మణపల్లి ఆదర్శ యుపిఎస్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కే.వర్షిణి, వై.శాన్వి, ఎం.కృతిక, శ్రీహిత, పి.శాన్వి, వర్షిత కిక్ బాక్సింగ్‌లో రాణించారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ చిప్ప భాస్కర్, ప్రిన్సిపాల్ సుజాత, కిక్ బాక్సింగ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు బండారి సంతోష్, జిల్లా కిక్ బాక్సింగ్ ఇన్‌చార్జి కర్ర వెంకటేష్‌లు అభినందించారు.

కానిస్టేబుల్‌ను అభినందించిన సీపీ


శ్రీలతను అభినందిస్తున్న సీపీ

కమాన్‌పూర్/యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్ యోగా విభాగంలో హాజరు కానున్న కానిస్టేబుల్ కూరపాటి శ్రీలతను మంగళవారం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. శ్రీలత కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తోంది. ఫిబ్రవరిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించింది. హైద్రాబాద్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ నిమిత్తం వెళ్తున్న శ్రీలతకు సీపీ అభినందనలు తెలిపారు. అక్టోబరు 13 నుండి 17 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో మొదటి స్థానంలో నిలిచి కమిషనరేట్ పేరు నిలపాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

మంథని, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదిత్య హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మంథని పటేలు ఐ కేర్ హాస్పిటల్, కరీంనగర్ సన్‌రైజ్ ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. బీపీ, షుగర్, ఈసీజీ, సీబీపీ, కంటి పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. నాలుగు వందల హాజరై పరీక్షలు చేయించుకున్నారు. సాయిని కృష్ణ, మేడగోని వెంకటేష్, డాక్టర్లు, పాల్గొన్నారు.

కలెక్టర్ పేర డబ్బులు డిమాండ్ చేస్తున్న డీడబ్ల్యూఎస్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

గోదావరిఖని, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్‌లోని జనగామ శివారు సర్వే నెం.706లోని భూమి ఎండీడబ్ల్యూఎస్ స్వచ్ఛంద నిర్మాణానికి పోరాటం చేస్తున్నానని, తనకు అనుకూలంగా తీర్పు వచ్చినప్పటికీ కలెక్టర్ రూ.10లక్షలు ఇవ్వాలని అడుగుతున్నట్టు డీడబ్ల్యూఎస్ (జిల్లా సంక్షేమశాఖాధికారి) డిమాండ్ చేశారని అధ్యక్షుడు పోచంపల్లి రాజయ్య ఆరోపించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 10గుంటలు కేటాయించాలని సింగరేణి యాజమాన్యాన్ని కోర్టు పేర్కొందని, భూమి ఇవ్వకుండా ఆ స్థలంలో కట్టిన నిర్మాణాలను సింగరేణి యాజమాన్యం కూల్చివేసిందని, దీనిపై హైకోర్టుకు వెళ్లగా భూమితోపాటు నష్టపరిహారం చెల్లించాలని సూచించిందన్నారు. 2024డిసెంబర్ 15న అప్పటి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలువగా 20గుంటల భూమి ఇప్పిస్తామని పేర్కొన్నారని, ఆయన బదిలీ కాగా ప్రస్తుత కలెక్టర్ కోయ శ్రీహర్షను కలువగా కోర్టు కేసు నుంచి తప్పుకోవాలని సూచించారన్నారు. అనంతరం కలెక్టర్ డీడబ్ల్యూఓను కలువాలని తెలుపగా ఆయన వద్దకు వెళితే రూ.10లక్షలు కలెక్టర్‌కు ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు పేర్కొన్నారు. జూన్‌లో హై కోర్టు ఆర్డర్ వచ్చిందని, విచారణ జరిపాలని కోర్టు ఆదేశించినట్టు చెప్పారు.



అంగీకరించిన డిమాండ్లను అమలు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సింగరేణి సీఎండీ, డైరెక్టర్(పా) స్థాయి స్ట్రక్చర్ సమావేశాల్లో ఏఐటీయూసీ ప్రతిపాదించిన పలు డిమాండ్లకు అంగీకారం తెలిపిన యాజమాన్యం వాటిని అమలు చేయాలని యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ముష్క సమ్మయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. దీర్ఘకాలిక సమస్యలైన సొంత ఇంటి పథకం అమలు, పెర్క్స్ మీద ఐటీ రీయింబర్స్, మారు పేర్ల సమస్య, ప్లేడేలు, డిస్మిస్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని పెండింగ్‌లో ఉన్న క్యాడర్‌స్కీం మెరుగుపరచాలనే డిమాండ్లను నెరవేర్చుతామని చెప్పిన యాజమాన్యం సర్క్యులర్లు జారీ చేయడం లేదని ఆరోపించారు.

యాజ మాన్య నిర్లక్షధోరణికి నిరసనగా ఈనెల 12న జరగాల్సిన స్ట్రక్చర్ సమావే శాన్ని బహిష్కరించినట్టు సమ్మయ్య తెలిపారు. వాస్తవ లాభాలు ప్రకటించి 35 శాతం కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 19న జీఎం ఆఫీస్‌ల ఎదుట తలపెట్టిన ధర్నాను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ఎల్ ప్రకాష్, రాజారత్నం, రవీందర్, అన్నారావు, సాంబశివరావు, మహేందర్, కుమారస్వామి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

షటిల్, టీటీ పోటీలు ప్రారంభం

రామగిరి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపీఏ డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ రాణిరుద్రమదేవి క్రీడాప్రాంగణంలో వర్క్‌పీపుల్స్‌స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రీజినల్ స్థాయి షటిల్, టీటీ పోటీలను మంగళవారం ఏరియా ఇంజనీర్ శేఖర్‌బాబు ప్రారంభించారు. ఆర్జీ-3, ఏపీఏ, భూపాల్‌పల్లి జట్లు పాల్గొన్నాయి. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్రరెడ్డి, బెల్లంశ్రీనివాస్, అధికారులు సుదర్శనం, సునీల్‌ప్రసాద్, కార్యదర్శి పర్వా శ్రీనివాస్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ జవ్వాజి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్లాంట్‌ను పరిశీలించిన ఎక్స్‌ప్లోజివ్స్ కంట్రోలర్లు


ప్లాంట్ పనులను పరిశీలిస్తున్న ఎక్స్‌ప్లోజివ్స్ కంట్రోలర్లు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-3 ఏరియాలోని ఎస్ఎంఎస్ ప్లాంట్‌ను మంగళవారం ఎక్స్‌ప్లోజివ్స్ కంట్రోలర్లు మన్విత్‌సింగ్ మానస్, రామేశ్వర్ బకార్‌లు సందర్శించారు. ప్లాంట్ సామర్థ్యం పెంపు పనులను పరిశీలించారు. ప్రస్తుతం రామగుండం రీజియన్‌లో ఉన్న ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులకు ఓబీ వెలికితీత కోసం ఉపయోగించే పేలుడు పదార్థాలు ఎస్ఎంఎస్ ప్లాంట్ నుంచి సంవత్సరానికి 30 వేల టన్నులు సరఫరా అవుతుందని, పెరిగిన అవసరాల దృష్ట్యా ఏడాదికి 60 వేల టన్నులు ఉత్పత్తి చేసేలా ప్లాంట్ విస్తరణ పనులు జరుగుతున్నట్టు జీఎం సుధాకర్‌రావు ఎక్స్‌ప్లోజివ్స్ కంట్రోలర్లకు వివరించారు. బాయిలర్లు, ట్యాంకర్లు, గోదాముల నిర్మాణ పనులను కంట్రోలర్లు పరిశీలించారు. ఎక్స్‌ప్లోజివ్స్ వెంట పీఓ ప్రవీణ్, మేనేజర్ శరవణన్ ఉన్నారు.

జనక్ ప్రసాద్‌పై విమర్శలు సరికాదు

గోదావరిఖని, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్‌పై ఏఐటీయూసీ నాయకులు విమర్శలు చేయడం సరైంది కాదని ఆర్‌జీ-1 ఉపాధ్యక్షుడు కచ్చకాయల సదానందం అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాటాడుతూ ఈ నెల 12న జరగాల్సిన స్ట్రక్చర్ మీటింగ్‌కు ఏఐటీయూసీ నాయకులు హాజరై కార్మికుల ప్రధాన సమస్యలపై చర్చిస్తారని కార్మికవర్గం అనుకుంటే సమావేశంలో పాల్గొనకుండా ఎందుకు బహిష్కరించారో కార్మికులకు తెలుపాలని డిమాండ్ చేశారు. జనక్ ప్రసాద్ కార్మికుల పక్షపాతి అని, కార్మికులకు లాభాల వాటా కోసం ముఖ్యమంత్రి, డిప్యూటీ, కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలను కలిసి కార్మికులకు లాభాల వాటా ఇప్పించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నారని, త్వరలోనే కార్మికులకు తీపికబురు వస్తుందని చెప్పారు. శంకర్‌నాయక్, కోట రవీందర్‌రెడ్డి, మంద రమేష్, తాటికొండ రాజయ్య, పూసాల శ్రీనివాస్, రాజయ్య, రవి, పాల్గొన్నారు.

సెక్యూరిటీ సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం(సెక్యూరిటీ) సీహెచ్ లక్ష్మీనారాయణ

గోదావరిఖని, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో మంగళవారం ఆర్‌జీ-1, 2, 3, శ్రీరాంపూర్, మంద మర్రి, బెల్లంపల్లి ఏరియాల సెక్యూరిటీ అధికారులతో సింగరేణి జీఎం(సెక్యూరిటీ) సీహెచ్ లక్ష్మీనారాయణ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. చెక్‌పోస్టులలో లైటింగ్, పరిసరాలలో చెట్ల పొదలు లేకుండా చూడాలని తెలిపారు. అప్రమత్తంగా ఉంటూ దొంగతనాలు జరగకుండా విధులను క్రమశిక్షణతో నిర్వహించాలని, అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని సూచించారు. సెక్యూరిటి అధికారులు వీరారెడ్డి, షరీఫ్, షబీరుద్దీన్, జక్కారెడ్డి, రవి, శ్రీధర్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్ర జ్యోతి): ఓసీపీ-3 ఏరియా స్టోర్స్ లను సింగరేణి సెక్యూరిటీ జీఎం లక్ష్మీనారాయణ తనిఖీ చేశారు. స్టోర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. డీజీఎం స్టోర్స్ విజయ్‌కుమార్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాజయ్య ఉన్నారు.

రామగిరి,(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-3 డివిజన్‌లో సెక్యూరిటీ జీఎం పర్యటించారు. 50 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ పవర్ ప్లాంట్‌లోని సబ్‌స్టేషన్‌ను పరి శీలించారు. ఏరియా ఇంజనీర్ శేఖ ర్‌బాబు, సెక్యూరిటి అధికారి షబ్బీరుద్దీన్, ఎస్ఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐఎన్‌టీయుసీ కట్టుబడి ఉంది


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

రామగిరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల పరిరక్షణలో ఐఎన్‌టీయుసీ కట్టుబడి ఉంటుందని ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోటరవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సెంటినరీకాలనీలోని కమ్యూనిటిహాల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందు వరుసలో ఉంటామన్నారు. మైన్స్‌లో భద్రత చర్యలు, కార్మికుల సంక్షేమ పథకాలు, లాభాల వాటా ఇతర అంశాల పై సింగరేణి సంస్థతో సంప్రదింపుల్లో ఉంటున్నామని పేర్కొన్నారు. రాబోయే కార్మిక ఉద్యమాలకు తగిన వ్యూహరచన, యువ కార్యకర్తలకు శిక్షణ, అన్ని మైన్స్‌లో ఐఎన్‌టీయుసీ శక్తిగా బలోపేతం కోసం ముందుకు వెళ్ళాల్సిందిగా సూచించారు. నాయకులు గడ్డం తిరుపతియాదవ్, ఎల్లంకి రామారావు, రాజకుమార్, బిక్షనాయక్, నరేడ్ల శ్రీనివాస్‌రావు, సత్రం సమ్మయ్య, రామిడ్ల మనోహర్, చారి, వెంటస్వామి, సర్వన్ మేకల మారుతీలు పాల్గొన్నారు.

లాభాల వాటాపై సర్క్యులర్ జారీ చేయాలి


గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న వై.వీరావు

రామగిరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): లాభాల వాటాపై సింగరేణి యాజమాన్యం వెంటనే సర్క్యులర్ జారీ చేయాలని ఏఐటీయుసీ డిప్యూటి జనరల్ సెక్రటరీ వై.వీరావు డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పిలో మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి లాభాల్లో 35 శాతం వాటా చెల్లించాలని స్ట్రక్చర్, జెసిసి సమావేశాల్లో యాజమాన్యం అంగీకారం తెలిపిందన్నారు. వాటాపై సింగరేణి స్పష్టత కోసం వెంటనే సర్క్యులర్‌ను జారీ చేయాలన్నారు. సింగరేణిలో నూతన గనులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత కొంత కాలంగా ఒపెన్‌కాస్టు ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న జనరల్ అసిస్టెంట్లను ఏఎల్‌పి నుంచి భర్తీ చేయాలన్నారు. ఈ గేట్‌మీటింగ్‌లో నాయకులు ఎంఆర్‌సి రెడ్డి, క్రాంతి, అడ్ల రమేశ్, సంతోష్, రంజిత్, రాజేష్, శ్రీనివాస్, హమీద్‌అలీ, చంద్రశేఖర్, సలీంరూప్‌సింగ్, దేవా రవీందర్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.